

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి న్యాయవాది B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 19-11-2022 సంపుటి : 04 సంచిక : 79 పేజీలు : 4 వెల : రూ 3-00

## మహిళా, శిశు సంక్షేమశాఖపై సమీక్ష..

### ఆ ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆదేశాలు



అమరావతి: మహిళా, శిశు సంక్షేమశాఖ, సంక్షేమ హాస్టళ్లపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం జగన్ గతంలో ఇచ్చిన ఆదేశాల అమలు ప్రగతిని అధికారులు వివరించారు. రూ.3,364 కోట్లతో హాస్టళ్లలో నాడు - నేడు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి విడతలో భాగంగా హాస్టళ్ల కోసం రూ.1500 కోట్ల ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి జనవరిలో పనులు ప్రారంభానికి కసరత్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పిల్లలకు మంచి మౌలిక సదుపాయాలతో పాటు కిచెన్ల ఆధునీకరించనున్నట్లు వెల్లడించారు.అంగన్‌వాడీలలో సూపర్ వైజర్ల పోస్టులను భర్తీచేశామని తెలియజేసిన అధికారులు.అంగన్వాడీలలో పాల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ, వాటి ఫలితాలను వివరించిన అధికారులు.అక్టోబరు నెలలో నూటికి నూటికి నూరుశాతం పంపిణీ జరిగిందన్న అధికారులు.డిసెంబర్1 నుంచి ఫ్లేవర్డ్ మిల్క్‌ను అంగన్వాడీల్లో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్న అధికారులు.పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా కొన్ని అంగన్‌వాడీల్లో అమలు చేస్తామన్న అధికారులు.మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీలలో సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలన్న సీఎం.అంగన్‌వాడీలలో నాడు - నేడు కార్యక్రమంపైనా సీఎం సమీక్షఅంగన్వాడీల నాడు-నేడు పనులు, అనంతర నిర్వహణపై సమగ్ర కార్యాచరణ ఉండాలని సీఎం ఆదేశం.మన పిల్లలే అక్కడకి వెళ్తారనుకుంటే ఎలాంటి వాతావరణం ఉండాలని కోరుకుంటామో అవన్నీ కూడా అంగన్‌వాడీలలో ఉండాలన్న సీఎం.అంగన్‌వాడీలలో టాయిలెట్ల నిర్వహణ, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్న సీఎం.ఈ మేరకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశం.గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో నాడు - నేడుపై సీఎం సమీక్షమొత్తం మూడు దశల్లో నాడు - నేడు కార్యక్రమం.హాస్టళ్లలో ఇప్పుడున్న పరిస్థితులు పూర్తిగా మారాలి.పిల్లలకు మంచి వాతావరణం అందించాల్సిన బాధ్యత మనపై ఉంది.హాస్టళ్లలో వెళ్లేసరికి జైల్లోకి వెళ్లిన భావం పిల్లలకు ఉండకూడదు.చదువులు కొనలేని కుటుంబాలు తమ పిల్లలను హాస్టళ్లకు పంపిస్తారు.వారు బాగా చదువుకోవడానికి, వారు బాగా ఎదగడానికి హాస్టళ్లు వేదిక కావాలి.?సమాజంలో అట్టడుగున ఉన్నవారు తాము చదువుకోవడానికి తగిన పరిస్థితులు లేవన్న భావన ఉండకూడదు.?హాస్టళ్లలో ఉంచాల్సిన బంకర్ బెడ్స్.. తదితర సౌకర్యాలన్నీ కూడా నాణ్యతతో ఉండాలి.భవనాలను పరిగణలోకి తీసుకుని వాటి డిజైన్లను రూపొందించాలి.?గురుకుల పాఠశాలలు- హాస్టళ్లు అన్నీ కలిపి మొత్తంగా 3013 చోట్ల నాడు-నేడు పనులు చేపట్టాలని నిర్ణయం.మొదటి ఫేజ్‌లో మొత్తం సుమారు 1366 చోట్ల నాడు - నేడు పనులు చేపట్టాలని నిర్ణయం.దశాబ్దాలుగా వెనకబాటుకు గురైన కర్నూలు పశ్చిమప్రాంతంలోని హాస్టళ్లన్నింటినీ కూడా మొదట విడతలోనే బాగుచేయాలని సీఎం ఆదేశం.మొదట విడతకు దాదాపుగా రూ.1500 కోట్లు, మొత్తంగా సుమారు రూ.3364కోట్ల వరకూ హాస్టళ్లలో నాడు - నేడు కోసం ఖర్చు అవుతుందని అంచనా.తొలివిడత పనులు వచ్చే జనవరి నుంచి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్న సీఎం.ఏడాదిలోగా ఆ పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశంహాస్టళ్లలో మౌలిక సదుపాయాలను అభివృద్ధిచేయడంతో పాటు, కిచెన్లను కూడా ఆధునీకరించే పనులు చేపట్టాలని సీఎం ఆదేశం.కిచెన్‌కు అవసరమైన దాదాపు 10 రకాల వస్తువులను ప్రతి హాస్టల్ కిచెన్ కోసం కొనుగోలు చేయాలని నిర్ణయం.హాస్టళ్ల పరిస్థితుల్లో గణనీయంగా మార్పులు కనిపించాలని సీఎం ఆదేశం.పిల్లలకు ఇవ్వాల్సిన వస్తువులను సకాలంలో నాణ్యతతో అందించాలని సీఎం ఆదేశం.హాస్టళ్ల పర్యవేక్షణ పద్ధతిని సమూలంగా మార్చాలన్న సీఎం.మండలాలవారీగా పర్యవేక్షణ ఉండాలన్న సీఎం.హాస్టళ్లలో ఉండాల్సిన సిబ్బంది కచ్చితంగా ఉండాలని సీఎం ఆదేశం.ఖాళీగా ఉన్న 759 మంది సంక్షేమ అధికారులు, 80 మంది కేర్ టేకర్ల పోస్టులను భర్తీచేయాలన్న సీఎం.ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లో 171 మంది హాస్టల్ వెల్ఫేర్ అధికారుల నియామకానికి గ్రీన్‌సిగ్నల్.పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో క్లాస్ -4 ఉద్యోగుల నియామకంపైనా దృష్టి పెట్టాలని ఆదేశం.ప్రతి హాస్టల్‌ను పరిశీలించి... కల్పించాల్సిన సౌకర్యాలు, ఉండాల్సిన సిబ్బంది తదితర అంశాలపై ముందుగా సమాచారాన్ని తెప్పించుకోవాలన్న సీఎం.హాస్టళ్ల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే.. ఫిర్యాదు చేయడానికి ప్రతి హాస్టల్లో ఒక నంబర్ ఉంచాలని సీఎం ఆదేశం.అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో కూడా ఫిర్యాదులు స్వీకరించడానికి ఒక నంబర్ ఉంచాలని సీఎం ఆదేశం.ఈ సమావేశానికి మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి కె వి ఉషా శ్రీచరణ్, సీఎస్ సమీర్ శర్మ, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఆర్థికశాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ, ఏపీ డీడీసీఎఫ్ ఎండీ ఏ బాబు, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ సిరి ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఇంట్లోకి వచ్చేదాకా వేచిచూడొద్దు.. ఉగ్రవాదులను వెంబడించాలి: మోదీ



దిల్లీ: ఉగ్రదాడి ఏ ప్రాంతంలో జరిగినా.. ఏ స్థాయిలో ఉన్నా ప్రతిస్పందన మాత్రం తీవ్రంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు.ఉగ్రదాడులు జరిగేదాకా ఎదురుచూడటం సరికాదని, మనమే వారిని వెంబడించి మట్టుబెట్టాలన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేంతవరకూ తమ ప్రభుత్వం విశ్రాంతి తీసుకోబోదని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా యావత్ ప్రపంచం ఏకమవ్వాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఉగ్రముఠాలకు నిధులను నిరోధించే అంశంపై దిల్లీ వేదికగా 'నో మనీ ఫర్ టెర్రర్' అంతర్జాతీయ సదస్సును ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగించారు. "గత కొన్ని దశాబ్దాలుగా భారత్ అనేక విధాలుగా ఉగ్రదాడులను ఎదుర్కొంటోంది. ఎన్నో విలువైన ప్రాణాలను మనం కోల్పోయాం. కానీ దీనిపై మనం ధైర్యంగా పోరాడుతున్నాం. ఉగ్రవాదాన్ని నిర్మూలించేంతవరకు మేం విశ్రమించబోం. తీవ్రవాదాన్ని అణచివేసేందుకు చురుకైన, వ్యవస్థీకృత స్పందన అవసరం. మన ప్రజలు సురక్షితంగా ఉండాలని మనం కోరుకుంటే.. ఉగ్రవాదం మనింటి లోపలికి వచ్చేవరకు వేచి చూడకూడదు. మనమే ముష్కరులను వెంబడించాలి. వారికి మద్దతుగా ఉన్న నెట్‌వర్క్‌లను విచ్ఛిన్నం చేయాలి. వారి ఆర్థిక వ్యవస్థలను దెబ్బకొట్టాలి'' అని మోదీ స్పష్టం చేశారు.కొన్ని దేశాలు తమ విదేశాంగ విధానంలో భాగంగా ఉగ్రవాదులకు మద్దతిస్తున్నాయని ప్రధాని మోదీ మండిపడ్డారు. "కొన్ని దేశాలు ముష్కరులకు ఆర్థికంగా అండగా ఉంటున్నాయి. మరికొన్ని దేశాలు ఉగ్రముఠాలపై ఆంక్షలు విధించకుండా అడ్డుకుంటున్నాయి" అంటూ పాకిస్థాన్, చైనాను పరోక్షంగా దుయ్యబట్టారు. అలాంటి వారిపై ఆర్థికపరమైన ఆంక్షలు విధించాలని ప్రధాని సూచించారు. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా విస్తరిస్తోన్న ఈ ఉగ్రవాదంపై పోరాడేందుకు మనమంతా ఏకమవ్వాలని ప్రపంచ దేశాలను కోరారు.రెండు రోజుల పాటు జరిగే ఈ 'నో మనీ ఫర్ టెర్రర్' సదస్సులో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మంత్రులతో పాటు ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎ) సభ్యులు, పలు ఉగ్ర నిరోధక సంస్థల అధినేతలు కలిపి దాదాపు 450 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. శనివారం ఈ సదస్సు ముగింపు సమావేశాల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రసంగించనున్నారు. ఉగ్రవాదులకు నిధుల నిరోధంపై జరుగుతున్న మూడో సదస్సు ఇది. అంతకుముందు 2018 ఏప్రిల్‌లో పారిస్ వేదికగా.. 2019 నవంబరులో మెల్‌బోర్న్‌లో 'నో మనీ ఫర్ టెర్రర్' అంతర్జాతీయ సదస్సులు జరిగాయి.

## జగన్ అక్రమాస్తుల కేసులో హెటిరో గ్రూప్ విచారణ ఎదుర్కోవాల్సిందే: సుప్రీం



దిల్లీ: సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో హెటిరో గ్రూపు సంస్థలకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ హెటిరో సంస్థలు వేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది.ఈ కేసులో ఇప్పటికే హెటిరో గ్రూప్ క్వాష్ పిటిషన్‌ను సీబీఐ కోర్టు, తెలంగాణ హైకోర్టు తోసిపుచ్చిన విషయం తెలిసిందే. అయితే, హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హెటిరో గ్రూపు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పిటిషన్‌పై జస్టిస్ జోసెఫ్, జస్టిస్ హృషికేశ్ రాయ్‌ల ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది. హెటిరో గ్రూపు సంస్థలపై కేసు కొట్టివేయదగినది కాదని ఈ సందర్భంగా జస్టిస్ జోసెఫ్ వ్యాఖ్యానించారు.ఏ1గా ఉన్న జగన్ కంపెనీ ప్రారంభించకుండానే హెటిరో గ్రూప్ రూ.350 ప్రీమియంతో షేర్లు కొనుగోలు చేసింది. పెట్టుబడులు పెట్టాక హెటిరోకు 80 ఎకరాలు కేటాయించారు. ఇవన్నీ దాచేస్తే దాగని సత్యాలని ధర్మాసనం అభిప్రాయపడింది. ''హెటిరో గ్రూప్ మొత్తాన్ని ఎఫ్ఐఆర్‌లో చేర్చడం సరికాదు. కంపెనీ సిబ్బందిపై కేసు పెట్టాలి కానీ కంపెనీపై కాదు" అని హెటిరో తరఫు న్యాయవాది చేసిన వాదనలను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. సీబీఐ పక్కాగా ఛార్జ్‌షీటు దాఖలు చేసిందని ధర్మాసనం పేర్కొంటూ కేసు కొట్టివేతకు నిరాకరించింది.

## నింగిలోకి దూసుకెళ్లిన తొలి ప్రైవేట్ రాకెట్..

### ప్రయోగం సక్సెస్

శ్రీహరికోట: భారత అంతరిక్షయాన రంగంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. దేశంలో తొలి ప్రైవేటు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) ఈ ప్రయోగానికి వేదికైంది.శుక్రవారం ఉదయం 11.30 గంటలకు షార్‌లోని సౌండింగ్ రాకెట్ కాంప్లెక్స్ నుంచి తొలి ప్రైవేటు రాకెట్ 'విక్రమ్-ఎస్' నింగిలోకి వెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతమైనట్లు శాస్త్రవేత్తలు ప్రకటించారు.హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ.. విక్రమ్-సబ్ ఆర్బిటల్ (వీకేఎస్) ఈ ప్రైవేట్ రాకెట్‌ను అభివృద్ధి చేసింది. ఈ మొట్టమొదటి మిషన్‌కు 'ప్రారంభ్' అని నామకరణం చేశారు. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ హాజరయ్యారు. వాస్తవానికి ఈనెల 12నే ప్రయోగం చేపట్టాల్సి ఉండగా వాతావరణం అనుకూలించకపోవడంతో నేటికి వాయిదా పడింది. విక్రమ్-ఎస్ రాకెట్.. సింగిల్ స్టేజ్ సబ్-ఆర్బిటల్ లాంచ్ వెహికల్ కావడం ప్రత్యేకత. ఈ రాకెట్ మూడు పేలోడ్‌లను అంతరిక్షంలోకి తీసుకెళ్లింది.అంతరిక్ష రంగంలో అడుగుపెట్టేందుకు ప్రైవేటు రంగానికి మన దేశంలో రెండేళ్ల క్రితమే అనుమతి లభించింది. అప్పటి నుంచి స్కైరూట్ ఏరోస్పేస్ ఈ రాకెట్ అభివృద్ధి పనుల్లో నిమగ్నమైంది. చాలా తక్కువ ఖర్చుతో, రెండేళ్లలోనే ఈ రాకెట్‌ను తయారుచేసినట్లు సంస్థ సీఈఓ పవన్ కుమార్ గతంలో వెల్లడించారు. మన దేశంలో అంతరిక్ష ప్రయోగాలకు అంకురార్పణ చేసిన ప్రముఖ శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్‌కి నివాళిగా తమ రాకెట్‌కు 'విక్రమ్-ఎస్' అని పేరు పెట్టినట్లు వెల్లడించారు. ఈ రాకెట్ ప్రయోగం కోసం స్కైరూట్.. ఇటీవల 51 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.408 కోట్లు) పెట్టుబడిని సమీకరించింది. మింత్రా వ్యవస్థాపకుడు ముఖేశ్ బన్సల్, గూగుల్ బోర్డు సభ్యుడు శ్రీరామ్.. ఈ సంస్థకు పెట్టుబడులు సమకూర్చిన వారిలో ఉన్నారు.విక్రమ్-ఎస్ రాకెట్ అంతరిక్షంలోకి తీసుకెళ్లే పేలోడ్‌లలో ఒకటి విదేశీ సంస్థకు చెందినది కాగా.. రెండు మన దేశ సంస్థలకు చెందినవి. ఇందులో ఒకటి చెన్నై కేంద్రంగా నడుస్తున్న స్పేస్‌కిడ్జ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2.5 కిలోల 'ఫన్-శాట్' పేలోడ్. దీనిని మన దేశంతో పాటు, అమెరికా, సింగపూర్, ఇండోనేసియా విద్యార్థులు రూపొందించారు.



## సీఎం జగన్ నరసాపురం పర్యటన ఖరారు

పశ్చిమగోదావరి(నరసాపురం): ఈ నెల 21న నరసాపురంలో జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకుఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు.గురువారం పట్టణంలో జరుగుతున్న సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రారంభించనున్న బస్టాండ్, 100 పడకల ఆసుపత్రి పనులు పరిశీలించారు.చిన్నచిన్న పెండింగ్ పనులు ఉంటే రెండురోజుల్లో పూర్తి చేసుకోవాలని చెప్పారు. చినమామాడిపల్లి వద్ద నిర్మించిన హెలీప్యాడ్‌ను, 25 వార్డు వీవర్స్‌కాలనీ వద్ద ముఖ్యమంత్రి బహిరంగ సభ వేదికను పరిశీలించారు. వేదిక పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. బహిరంగసభ వద్ద పార్కింగ్ విషయంలో ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు వాయిదా పడ్డ సీఎం పర్యటన 21న ఖరారు అయ్యిందని చెప్పారు. ఆ రోజు ప్రపంచ మత్స్యకార దినోత్సవం కావడంతో నరసాపురంలో జరిగే వేడుకల్లో సీఎం పాల్గొంటారని చెప్పారు. ఆక్వా యూనివర్సిటీ, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్, వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్ట్ పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. బస్టాండ్, ఆసుపత్రి వంటి పూర్తయిన పనులను ప్రారంభిస్తారని వివరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి నారాయణ ఇంటికి ఏపీ సీఐడీ అధికారులు



హైదరాబాద్: హైదరాబాద్‌లో ఉంటున్న మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఇంటికి ఏపీ సీఐడీ అధికారులు వెళ్లారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు.హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో న్యాయవాదుల సమక్షంలో సీఐడీ అధికారులు నారాయణ వివరణ తీసుకున్నారు.ఇన్నర్ రింగ్ రోడ్ మాస్టర్ ప్లాన్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో సీఐడి అధికారులు గతంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా.. సాక్షిగా విచారణకు రావాలంటూ నారాయణకు సీఐడీ అధికారులు 160 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చారు. అయితే, ఈ నోటీసుపై ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అనారోగ్యంతో ఉన్నారని.. ఇటీవల శస్త్రచికిత్స జరిగిందని నారాయణ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఆయనకు 65 ఏళ్ల వయసు దాటిందని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. వాదనలు విన్న న్యాయస్థానం.. నారాయణను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోనే న్యాయవాది సమక్షంలో విచారించుకోవచ్చని స్పష్టం చేసింది.

# సంపాదకీయం

శనివారం 19-11-2022

## జీ 20పై మోడీ మేనియా...

జీ 20 కూటమికి అధ్యక్షుడిగా మోదీ నాయకత్వం ఎలా ఉండనుంది అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. యూకేలో రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇలా ప్రతీ దేశం భారత్ తో సత్సంబంధాలు ఉండాలని కోరుకుంటున్న సమయంలో ఈ ఏడాది మోదీ మేనియా జీ20 మీద ఉండనుందని అంతా భావిస్తున్నారు. ఇండోనేషియాలోని బాలి ఐలాండ్ లో రెండు రోజుల పాటు జరిగిన జీ-20 సదస్సు ముగిసింది. చివరిరోజున ఇండోనేషియా ప్రధాని నుంచి జోకో విడోడో నుంచి భారత ప్రధాని నరేంద్ర మోదీ జీ-20 అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. వచ్చే ఏడాది భారత్ లోనే జీ20 సమావేశాలు జరుగుతున్నందున రోస్టర్ ఛైర్ ప్రకారం మోదీ ఏడాది పాటు ప్రెసిడెన్సీ బాధ్యతల్లో ఉంటారు. జీ20లో అమెరికా, రష్యా, చైనా, జపాన్, జర్మనీ లాంటి ఆర్థికంగా శక్తిమంతమైన దేశాలు ఉన్నాయి. కాబట్టి, ఈ దేశాలన్నింటికీ ఏడాది పాటు మోదీ మాటే శాసనమా అనే సందేహాలు చాలా మందిలో ఉన్నాయి. జీ 20లో భారత్, అమెరికా, రష్యా, చైనా సహా 19 దేశాలు ఇంకా యూరోపియన్ యూనియన్ భాగంగా ఉంటాయి. అంతే కాదు వరల్డ్ బ్యాంక్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, వరల్డ్ ట్రేట్ ఆర్గనైజేషన్, ఆఫ్రికా యూనియన్ కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటాయి. ఈ దేశాలన్నీ కలిసికట్టుగా ఎలా ముందుకు వెళ్లాలి అని ఏడాదికోసారి ఓ అజెండాను రూపొందించుకుంటాయి. ఈ అజెండా ప్రకారం జీ20 నడిపించాల్సిన బాధ్యత అధ్యక్షుడి మీద, ప్రెసిడెన్సీ కంట్రీ మీద ఉంటుంది. తాజాగా జరిగిన సమావేశం చివరిరోజు ప్రధాని మోదీ జీ20 అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారని తెలిసిందే. ఉ20 కి ప్రత్యేకమైన అధికారాలు ఏం ఉండవు. అంటే వేరే దేశాల అంతర్గత వ్యవహారాల్లో జీ20 ప్రెసిడెంట్ జోక్యం చేసుకోలేరు. కానీ ఇన్ ఫ్లుయెన్స్ చేయగలరు. అంటే మన ఇండియా కోణం నుంచి చూస్తే ఓ ప్రభావవంతమైన దేశంగా జీ20 కూటమిలో భారత్ ఎదిగేలా ఈ ఏడాది ఉపయోగించుకోవచ్చు. జీ 20 కి ప్రత్యేకంగా శాశ్వత సెక్రటేరియట్ భవనం ఎక్కడా లేదు. ట్రోయికా అంటారు. అంటే చివరిగా జీ20 కు ఆతిథ్యం ఇచ్చిన దేశం. ఇప్పుడు ఆతిథ్యం ఇవ్వబోయే దేశం. వచ్చే ఏడాది ఆతిథ్యం ఇవ్వబోయే దేశం ఇలా ఎప్పటికప్పుడు మూడు దేశాలు కో ఆర్డినేట్ చేసుకుని సమావేశాలను నిర్వహించుకుంటున్నాయి. సో ఈ సారి భారత్ ప్రెసిడెన్సీలోనే ఈ సెక్రటేరియట్ భవనం ఓ కొలిక్కి వచ్చి అది భారత్ లో ఏర్పడితే.. మన దేశానికి అది ఓ ల్యాండ్ మార్క్‌లా మిగిలిపోతుంది. జీ 20 సమావేశాలకు భారత్.. విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్ష వర్ధన్ ష్రింగ్లాను నియమించింది. పాలసీ నిర్ణయాలు కానీ, జీ20 సమావేశాలను భారత్ నిర్వహించటంలో అధ్యక్షుడు మోదీకి సహకరిచటంలో చీఫ్ కో ఆర్డినేటర్ పాత్ర కీలకం. రెండు వేర్వేరు విధాలుగా జీ20 ప్యారలల్ ట్రాక్స్ లో నడుస్తూ ఉంటుంది. జీ20 దేశాల అధినేతలు సమావేశమయ్యే ప్రధాన సమావేశాలు కాకుండా ఏడాది మొత్తంలో వేర్వేరు సమావేశాలు కూడా జరుగుతూ ఉంటాయి. ఒకటి ఫైనాన్స్ ట్రాక్, రెండోది షెర్పా ట్రాక్. ఫైనాన్స్ ట్రాక్ లో ఆయా దేశాల ఆర్థికమంత్రులు, రిజర్వ్ బ్యాంకు గవర్నర్లు, సెక్రటరీలు సమావేశాలు జరుపుతూ ఉంటారు. షెర్పా ట్రాక్ లో జీ 20 దేశాల దౌత్యవేత్తల మధ్య సమావేశాలు నిర్వహిస్తుంటారు. మంచు పర్వతాలను అధిరోహించేప్పుడు ప్రత్యేకించి ఎవరెస్ట్ ను ఎక్కేప్పుడు అక్కడ ఉండే స్థానిక టిబిటెన్లు సహాయ సహకారాలు అందిస్తారు. వీరినే షెర్పాలు అంటారు. అలానే జీ20 నిర్వహణకు నీతి ఆయోగ్ ను ఆరేళ్లు నడిపించిన అమితాబ్ కాంత్ ను ఇండియా జీ 20 షెర్పాగా కేంద్రం నియమించింది. విదేశీ వ్యవహారాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నినాదం ఒక్కటే వసుధైక కుటుంబం. ఇదే నినాదాన్ని జీ 20 దేశాలకు చేరువ చేయాలని భారత్ ప్రణాళిక. ఇదే నినాదంతో జీ20 2023 లోగోను ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 2023 సెప్టెంబర్ 9-10 రెండు రోజుల పాటు జీ 20 సమావేశాలు న్యూఢిల్లీలో జరగనున్నాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభం అంచున ఉన్నాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్ ఎకానమీ సిస్టమ్స్ కొవిడ్ 19 వ్యాప్తి తర్వాత కుప్పకూలాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ సహా తూర్పు దేశాల వైపు ప్రపంచ దేశాలు ఆధారపడేలా చేయగలిగితే భారత్ లాంటి దేశాలు బాగా లాభపడే అవకాశాలు ఉన్నాయి. దీనిపైనా మోదీ దృష్టి సారించే అవకాశం ఉంది. జీ20 కూటమి అధినేతగా నరేంద్ర మోదీ ప్రపంచ ఆర్థిక సంస్థల సంస్కరణలను కోరవచ్చు. వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్ లాంటి సంస్థల నియమ నిబంధనలను జీ20 దేశాల అభివృద్ధి అనుకూలంగా సరళీకృతం చేయటం, సరికొత్త సంస్కరణలు చేపట్టడం ద్వారా ఆర్థికంగా జీ20 దేశాలకు ప్రత్యేకించి అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్ కు మేలు చేకూర్చే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి.

# సానుభూతి కోసమా.... గేమ్ ప్లానా

### చంద్రబాబు కామెంట్స్ పై వైసీపీ మైండ్ గేమ్

కర్నూలు, నవంబర్ 18, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకపోతే .. ఇవే తనకు చివరి ఎన్నికలను చంద్రబాబు కర్నూలు టూర్‌లో ప్రకటించారు. పార్టీ కార్యకర్తలు, భారీగా తరలి వచ్చిన జన సందోహం మధ్యనే ఆయనీ ప్రకటన చేశారు. వెంటనే ఏపీ రాజకీయాల్లో ఒక్క సారిగా కలకలం ప్రారంభమయింది. తెలుగుదేశం పార్టీ మినహా అన్ని రాజకీయ పార్టీలు భిన్న కోణాల్లో అన్వయించుకుని ప్రకటించుకుంటున్నారు. చర్చించుకుంటున్నారు. కానీ టీడీపీ నేతలు మాత్రం ఈ అంశంపై గుంభనంగా వ్యవహరిస్తున్నారు. తమకు కావాల్సింది ఇతర అన్ని చోట్లా చర్చ జరగడమేనన్నట్లుగా ఉన్నారు. ఇంతకీ చంద్రబాబు ఎందుకలా అన్నారు ? సానుభూతి కోసమా ? గెలవకపోతే రాజకీయాల్లో ఉండరా ? " మీ పిల్లలు పెద్దయ్యే వరకూ నేను ఉంటానో ఉండనో కానీ.. అమరావతి మాత్రం శాశ్వతం.. రాష్ట్రం మాత్రం శాశ్వతం అందుకే చూసి ఓటేయండి'' అని గత ఎన్నికలకు ఓటింగ్ ముందు చంద్రబాబు ప్రజల్ని కోరారు. అయితే ప్రజలు మాత్రం ఆ విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ఐదేళ్లు పరిపాలించిన తెలుగుదేశం పార్టీకి ఘోరపరాజయం ఇచ్చారు. ఐదేళ్లు ప్రజల కోసం.. రాష్ట్రం కోసం అంత కష్టపడ్డానన్న భావనలో ఉన్న నేత..అంత ఘోర పరాజయం పాలైతే.. ఇంకెందుకు రాజకీయాలు అనుకోవడం సహజం. అయితే చంద్రబాబులో అలుపెరుగని రాజకీయ నేత ఉన్నారు. ఈట్ పాలిటిక్స్.. డ్రింక్ పాలిటిక్స్.. స్లీప్ పాలిటిక్స్ అన్నట్లుగా యాభై ఏళ్లుగా జీవిస్తున్నారు. అందుకే ఓటమిని జీర్ణించుకుని మళ్లీ ప్రజల్లోకి వెంటనే వచ్చారు. ప్రజా మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి స్పిరిట్ ఉన్న నేత రాజకీయాల నుంచి విరమించుకుంటారని ఎవరూ అనుకోరు. కానీ ఆయన నోటి నుంచి ఆ మాట రావడం సంచలనం అయింది. రాజకీయాల్లో సానుభూతిని మించిన గెలుపు సూత్రం మరొకటి ఉండదు. గత ఎన్నికల్లో ఒక్క చాన్స్ ప్లీజ్ అని జగన్మోహన్ రెడ్డి దీనంగా అడగడం వల్లనే ఆయనకు ప్రజలు చాన్సిచ్చారని రాజకీయవర్గాలు గట్టిగా నమ్ముతూ ఉంటాయి. ఆ మాటకు వస్తే వైఎస్ఆర్‌సీపీ రాజకీయ పునాదులు సానుభూతి మీదనే ఉన్నాయంటారు. ఇప్పుడు చంద్రబాబు కూడా అదే వ్యూహాన్ని పాటిస్తున్నారని అంచనా వేస్తున్నారు. చివరి ఎన్నిక అంటే.. ప్రజలు చివరి చాన్స్ ఇస్తారని గతంలో అనేక మంది రాజకీయ నేతలు ఇదే నినాదంతో పోటీ చేసినప్పుడు రుజువు అయిందంటున్నారు. చంద్రబాబు కూడా ఇదే వ్యూహాన్ని పాటిస్తున్నారని కొన్ని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. అదే సమయంలో రాష్ట్రానికి ఎంతో సేన తనను.. రాజకీయాలతో సంబంధమే లేని తన కుటుంబాన్ని కించపరిచారని.. గెలిస్తేనే ..సీఎం హోదాలోనే మళ్లీ అసెంబ్లీకి వస్తానని చాలెంజ్ చేశానని ప్రజలకు చెబుతున్నారు. ఇదంతా వ్యూహాత్మకమేనని అంటున్నారు. చంద్రబాబు ప్రకటనను ఇతర రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకుని విశ్లేషిస్తున్నాయి. చంద్రబాబు పనైపోయిందని..అందుకే అలా మాట్లాడుతున్నారని అంటున్నారు. ఆయనకు గత ఎన్నికలే చివరివి అని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. బీజేపీ నేతలు కూడా అదే చెబుతున్నారు. చంద్రబాబు ఔట్ డేటెడ్ లీడర్ అని.. వచ్చే ఎన్నికలే ఆయనకు చివరివని జీవీఎల్ నరసింహారావు వ్యాఖ్యానించారు. జనసేన నేతలు ఎవరూ పెద్దగా బయటకు ప్రకటన చేయలేదు కానీ..సోషల్ మీడియాలో మాత్రం... ఇక చంద్రబాబు రాజకీయ శకం ముగిసిందంటూ కామెంట్లు చేస్తున్నారు. నిజానికి చంద్రబాబును ఈసారి ఓడిస్తే తమకు తిరుగు ఉండదని వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రతీ రోజూ తమ పార్టీ నేతలకు చెబుతున్నారు. దీనికి కారణం.. వచ్చే ఎన్నికల్లోనూ ఓడిపోతే చంద్రబాబు వయసు రీత్యా యాక్టివ్‌గా ఉండలేరని.. ఈ కారణంగా టీడీపీ కూడా ఇబ్బంది పడుతుందని.. తమకు ఎదురు ఉండదని ఆయన ఆలోచన. ఈ విషయంలో వైఎస్ఆర్‌సీపీ కూడా అదే అనుకుంటోంది. మరి టీడీపీకి చంద్రబాబు తప్ప ప్రత్యామ్నాయ నాయకత్వం లేదా అంటే.. ఉన్నా జగన్‌ను ఢీ కొట్టలేరని వారి భావన కావొచ్చంటున్నారు. రాజకీయాల్లో సన్యాసం సవాళ్లు అతి సాధారణం. కానీ ఎవరూ ఇంత వరకూ సన్యాసం తీసుకోలేదు. రాష్ట్రం విడిపోతే రాజకీయాల నుంచి తప్పుకొంటానని.. మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ చాలెంజ్ చేశారు. అన్నట్లుగానే ఆయన వైదొలిగారు. మళ్లీరాలేదు. బహుశా సందర్భం రాలేదు. సందర్భం వస్తే అభిమానులు పిలుస్తున్నారని ఆయన కూడా రాజకీయాల్లోకి వచ్చేస్తారు. చంద్రబాబు కూడా అంతే. ఆయన రాజకీయాల నుంచి విరమించుకుంటున్నానని ప్రకటిస్తే.. వద్దని ఆయనను బతిమిలాడే క్యాడర్ ఉంటుంది. అదే సమయంలో చంద్రబాబు రాజకీయాలు చేయకుండా ఖాళీగా ఉంటారని ఎవరూ అనుకోరు. చంద్రబాబు ప్రకటన ఓ రాజకీయ ఎత్తుగడగానే అందరూ భావిస్తున్నారు. కానీ రాజకీయంగా తమకు అనుకలంగా విశ్లేషించుకునేందుకు ఎక్కువ తాపత్రయ పడుతున్నారు. టీడీపీ మాత్రం ఇలాంటి ప్రచారం ఎంత జరిగితే అంత మంచిదన్నట్లుగా గుంభనంగా వ్యవహరిస్తోంది.

## 24న రా.రా శతజయంతి సదస్సు

కడప సాహిత్య అకాడమి, యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్త నిర్వహణలో రా.రా. (రాచమల్లు రామచంద్రారెడ్డి) శతజయంతి సదస్సును నవంబరు 24 గురువారం ఉదయం 10.00 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నామని ఆ కేంద్రం బాధ్యులు డా. మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు ప్రారంభ సమావేశంలో ముఖ్యఅతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్యకళావతి, సభాధ్యక్షులుగా సాహిత్య అకాదెమి తెలుగు సలహా మండలి కన్వీనర్ కె.శివారెడ్డి, గౌరవ అతిథిగా సాహిత్య అకాదెమి పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పాల్గొంటారని, సాహిత్య అకాడమి తెలుగు సలహా మండలి సభ్యులు డా యాకూబ్ కీలకోపన్యాసం చేస్తారని, డా. మూల మల్లికార్జున రెడ్డి సభా ప్రస్తావన చేస్తారని అన్నారు.



తదనంతరం జరిగే మొదటి సదస్సుకు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అధ్యక్షత వహించి 'మార్క్సిస్టు విమర్శకుడుగా రారా' అనే అంశంపై, చింతకుంట శివారెడ్డి 'రారా జీవితం, వ్యక్తిత్వం' అనే అంశంపై పత్ర సమర్పణ చేస్తారని, భోజనానంతరం జరిగే రెండవ సదస్సుకు కిన్నెర శ్రీదేవి అధ్యక్షత వహించి 'కథారచయితగా రారా' అనే అంశంపై, తుమ్మలూరు సురేష్‌బాబు 'పాత్రికేయుడుగా రారా' అనే అంశంపై పత్ర సమర్పణ చేస్తారని, మూడవ సదస్సుకు మందలపర్తి కిశోర్ అధ్యక్షత వహించి 'అనువాదకుడుగా, అనువాద అధ్యయనశీలిగా రారా' అనే అంశంపై, ఆర్.రాజేశ్వరమ్మ 'రారా లేఖలు, ముందుమాటలు' అనే అంశంపై పత్ర సమర్పణ చేస్తారని అన్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ముగింపు సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్ అధ్యక్షత వహిస్తారని, బాధ్యులు డా.మూల మల్లికార్జున రెడ్డి కార్యక్రమ నివేదికను సమర్పిస్తారని, విశ్రాంత ఆకాశవాణి సంచాలకులు డా తక్కోలు మాచిరెడ్డి సమాపన ప్రసంగం చేస్తారని, కేంద్రం సహాయ పరిశోధకులు డా భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందని అన్నారు

## కిం కర్తవ్యం...ఏ పార్టీ మదిలో ఏముందో...

విజయవాడ, నవంబర్ 18, ఏపీలో మరో ఏడాదిన్నరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. వైసీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ నేతలు ఇప్పటికే స్పష్టం చేశారు. మరోవైపు బీజేపీ , టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయనే ప్రచారం జరుగుతోంది. అయితే రాష్ట్ర బీజేపీ మాత్రం జనసేనతో కలిసే ఉన్నామని, వచ్చే ఎన్నికల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తారని చెబుతోంది.కానీ ఇటీవల పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు మాత్రం ఇప్పటికీ చర్చనీయాంశంగానే ఉన్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో ప్రతిపక్ష పార్టీతో కలిసి జనసేన పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ వ్యాఖ్యల్లో అర్థమైంది. అంతేకాదు టీడీపీ, బీజేపీ, జనసేన కలుస్తాయని ఇన్ డైరెక్ట్‌గా హింట్ ఇచ్చినట్లుగా అయ్యాయి. అయితే ఇటీవల జరిగిన పరిణామాలు కూడా ఈ మూడు పార్టీలు కలిసి ఎన్నికలు వెళ్తాయనే ప్రచారానికి ఊపునిచ్చాయి. కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో ప్రధాని మోదీ ని చంద్రబాబు కలిశారు.ఆ తర్వాత ఇప్పటంలో జరిగిన ఘటనలతో పవన్ కల్యాణ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఆ తర్వాత ప్రధాని మోదీ విశాఖ పర్యటనకు రావడంతో ఆయనను పవన్ కల్యాణ్ కలిసి ఏకాంతంగా చర్చించడం వంటి పరిణాలు జరిగాయి.అయితే ప్రధాని మోదీతో పవన్ భేటీ పలు ప్రచారాలకు తావిచ్చింది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కోసమే భేటి జరిగినట్లు ఊహాగానాలకు తెరలేపాయి. బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకోబోతున్నాయని.. అందుకు మోదీ, పవన్ భేటీనే వేదిక కానుందనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత అంతా కామ్ అయిపోయింది.అయితే ఏపీ బీజేపీ మాత్రం ఈ ప్రచారాన్ని కొట్టిపారేసింది. కుటుంబపాలనకు తాము వ్యతిరేకమని చెబుతోంది. 2024లో జనసేనతోనే కలిసి ఎన్నికలు వెళ్తామని అంటోంది. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనతోనే తమ మైత్రి ఉంటుందని, టీడీపీతో కలిసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని పవన్ కల్యాణ్‌కు కూడా ఢిల్లీ పెద్దలు చెప్పారని తెలిపారు. జనసేన తమతోనే ఉంటుందని.. పవన్ కల్యాణ్‌ను ఒప్పిస్తామని చెప్పారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాశంగా మారాయి.కాగా 2014 ఎన్నికల్లో ఏపీ, తెలంగాణలో బీజేపీ, టీడీపీ కలిసి పోటీ చేశాయి. ఏపీలో అధికారంలోకి వచ్చాయి. తెలంగాణలో కొన్ని సీట్లు గెలుచుకున్నాయి. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో 2019 ఎన్నికల్లో ఏపీలో టీడీపీ, బీజేపీ ఒంటరిగా పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో వైసీపీ విజయ ఢంకా మోగించింది. ప్రస్తుతం ఏపీలో సంక్షేమ పథకాలు అమలవుతున్నా.. .జగన్ సర్కార్ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని ప్రతిపక్ష పార్టీలు అంటున్నాయి. దీంతో వచ్చే ఎన్నికలపై దృష్టి సారించాయి. ఎవరికి వాళ్లు ప్రజల్లోకి వెళ్లేందుకు వ్యూహ రచనలు చేస్తున్నాయి. అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి.అయితే సోము వీర్రాజు మాత్రం బీజేపీ-జనసేన ఒక్కటిగా ఎన్నికలకు వెళ్తాయని చెబుతున్నారు. కానీ కేంద్రంలో ఉన్న బీజేపీ మాత్రం ఎక్కడా పొత్తులు గురించి ప్రస్తావించలేదు. ఎన్నికలకు సమయం ఉంది కాబట్టి తర్వాత ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయం దగ్గర పడితే రాజకీయ పరిణామాలు మారే అవకాశం లేకపోలేదు. బీజేపీ అగ్రనేతలు తీసుకునే నిర్ణయం మేరకే రాష్ట్ర నేతలు అడుగులు వేయాల్సి ఉంటుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో వుండాలి



రాయచోటి వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో వుండాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విలేజ్ క్లీనిక్ లు ఏర్పాటు చేయడం జరుగుతోందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు శుక్రవారం రాయచోటి రూరల్ మండలంలోని కాటిమాయకుంట విలేజ్ క్లినిక్ నూతన భవనం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు

### విలేజ్ క్లినిక్ నూతన భవనం ప్రారంభం

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉండేలా 2500 జనాభాకు వైయస్సార్ విలేజ్ క్లినిక్లను జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించ నున్నారు. ఈ క్లినిక్ లో 12 రకాల వైద్య సేవలు అందించడంతోపాటు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తాన్నారు. 65 రకాల మందులతో పాటు. 67 రకాల బేసిక్ మెడికల్ ఏ క్వీప్ మెంట్ అందుబాటులో ఉంటుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటి వద్దకే నాణ్యమైన వైద్యాన్ని జగనన్న ప్రభుత్వం అందిస్తుందన్నారు

# ఖిద్మత్ ఫౌండేషన్ సామాజిక సేవ అభినందనీయం

### ప్రముఖ సంఘ సేవకులు సలావుద్దీన్ పేర్కొన్నారు



కడప నవంబర్ 18: ఖిద్మత్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సామాజిక కార్యక్రమాలు అభినీయమని ప్రముఖ సంఘసేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు శుక్రవారం కడప రిమ్స్ లో ఖిద్మత్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సయ్యద్ సలావుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈసందర్భంగాఆయనమాట్లాడుతూ కడపలోని ఖిద్మత్ ఫౌండేషన్ఫౌండేషన్ గత మూడు సంవత్సరాల నుండి పలు



ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కరోనాకాలంలో కూడా ఓల్డ్ రిమ్స్ , కొత్త రిమ్స్,అన్నదాన కార్యక్రమం చేపట్టారని ఇప్పటివరకు 200 కార్యక్రమాలు నిర్వహించి 201 అన్నదాన కార్యక్రమం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు

## అంగన్వాడీ వ్యవస్థను కాపాడాలి

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

కడప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో యూనియన్ ఎనిమిదవ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి నిర్వహణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు పెంచకుండా నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జీతం పెంచుతానని కేవలం రూ.1000 పెంచి అంగన్వాడీలను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే అంగన్వాడి భవనాలను నిర్మించి ఇవ్వాలని చెప్పారు. వైయస్సార్ సంపూర్ణ పోషణకు సంబంధించి చేనుతాడంత హామీలు ఇచ్చి వాటికి తగిన విధంగా బడ్జెట్ కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ప్రచారానికి ఆర్భాటం ఇస్తుంది తప్ప అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని పేర్కొన్నారు ఈ మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, జి. చంద్రశేఖర్, రామమోహన్, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, నాయకులు సలీమా, వినోదా దేవి, ఆర్. లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, సుహాసిని, అంజలీదేవి, వినీల, ధనలక్ష్మి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.ఎన్ సుబ్బమ్మ, సెక్టార్, ప్రాజెక్టు లీడర్స్ పాల్గొన్నారు.



# విషాదయాత్రలుగా మారుతున్న విహార యాత్రలు

శ్రీకాకుళం, నవంబర్ 18, సిక్కోలు సముద్రతీరంలో మృత్యు ఘోష విన్పిస్తోంది. విహారయాత్రలకు వచ్చి సముద్రం స్నానాలకి దిగి మృత్యువాత పడుతున్న సంఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్నాయి. వారం రోజుల వ్యవధిలో శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల, గార మండలాల పరిధిలోని బుడగట్లపాలెం, మొగదాలపాడు ప్రాంతాలలో పలువురు మృత్యువాతపడ్డారు. ఈ వరుస ఘటనలు కలకలం రేపుతున్నాయి. ప్రతి ఏడాది పిక్నిక్ సీజన్ లో ఇటువంటి ప్రమాదాలు జిల్లాలో చోటుచేసుకుంటునే ఉన్నాయి. వాటిని గమనించి జాగ్రత్తలు పాటించాల్సిన ప్రజలు అజాగ్రత్తతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. సరదాగా సముద్ర స్నానాలు చేస్తూ అందని లోకాలకు చేరుకుంటున్నారు. కన్నవారికి కుటుంబ సభ్యుల గుండె కోతకి కారణమవుతున్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం పిక్నిక్ లు పెద్ద ఎత్తున జిల్లాలో జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శ్రీకాకుళం జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో విహారాలకు వెళ్తున్నారు. రణస్థలం నుంచి ఇచ్ఛాపురం వరకూ అనేక చోట్ల బీచ్ లకు ప్రజలు క్యూ కడుతున్నారు. బుడగట్లపాలెం, డి.మత్స్యలేశం, బొంతల కోడూరు, పెద్దగంగళ్లవానిపేట, కుందువానిపేట, మొగదాలపాడు, కళింగపట్నం, బారువ, భావనపాడు ప్రాంతాలు ఆదివారం పూట కోలాహలంగా కన్పిస్తుంటాయి. సాధారణ రోజులలో కూడా విందులు, వినోదాల కోసం మిత్రులు, స్నేహితుల గ్రూపులు తీర ప్రాంతానికి వస్తుంటారు. అలా వచ్చిన వారిలో కొందరు మద్యం సేవించి స్నానాలకు దిగుతుంటారు. ఒక్కొసారి వారు పెద్ద పెద్ద కెరటాల బారిన పడి లోపలకి కొట్టుకుపోయి గల్లంతవుతున్నారు. తర్వాత ప్రాణాలు కోల్పోయి ఒడ్డుకు మృతదేహాలుగా చేరుతున్నారు. దీంతో విహారం కాస్తా విషాదంగా మారిపోతుంది.ఆదివారం ఎచ్చెర్ల మండలంలోని బుడగట్లపాలెం తీరంలో పిక్నిక్ కి వచ్చిన వారిలో కొందరు సముద్ర స్నానాలకు దిగారు. అలా దిగిన వారిలో ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకి చెందిన బెండి తేజేశ్వరరావు(19)తో పాటు లావేరు మండలంలోని మురపాక పంచాయితీ చెల్లయ్య అగ్రహారానికి చెందిన కలమటి ప్రసాదరావు(16) లు గల్లంతయ్యారు. వారిద్దరూ కూడా విద్యార్థులే. తేజేశ్వరరావు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగా ప్రసాదరావు ఇంటర్ చదువుతున్నాడు. వారిద్దరిలో తేజేశ్వరరావు మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. ప్రసాదరావు ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. దీంతో ఆ కుటుంబాలలో విషాదం నెలకొంది. అదేవిధంగా గార మండలంలోని మొగదాలపాడు తీరంలో బుధవారం విహార యాత్రకు స్నేహితులు వెళ్లారు. వారు సముద్ర స్నానాలకి దిగగా వారిలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలోని తోటపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు శంకరరావు, ఆమదాలవలస పట్టణం పరిధిలోని మెట్టక్కివలసకి చెందిన గొల్లపల్లి మనోజ్ కుమార్ లు గల్లంతయ్యారు. వారి మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. వరుసగా జరిగిన ఈ ఘటనలు విహార యాత్రలకి వెళ్లే వారిలో ఆందోళన రేకెత్తిస్తున్నాయి.సముద్ర స్నానాలకి దిగేటప్పుడు అజాగ్రత్తగా ఉండడంతో పాటు అత్యుత్సాహం ప్రదర్శించడం వల్లనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని పోలీసులు అంటున్నారు. తీర ప్రాంతవాసులకి సముద్రపు అలలపై అవగాహన ఉంటుంది. ఆయా ప్రాంతాలకు సమీపంలో ఉన్న వారికి మినహా మిగిలిన వారికి అక్కడి పరిస్థితులు గురించి అంతగా తెలియదు. సముద్ర తీరంలో ఇసుక తిన్నెలు, ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాలు ఉల్లాసాన్ని కలిగిస్తాయి. మునిగిపోయేంత లోతు లేకపోవడంతో ఈత వచ్చినా, రాకపోయినా పిల్లలు సముద్రస్నానం చేస్తారు. కెరటాల రాకపోకలపై అవగాహనలేకపోవడంతో తమకు తెలియకుండానేలోతుకుజారుకుంటారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.సముద్రంలో స్నానం చేసేటప్పుడు కెరటాల తాకిడి, ఎత్తు, కోతను గమనిస్తూ ఉండాలి. ఛాతీలోతు వరకూ వెళ్లి తాము సురక్షితంగా ఉన్నామని భావించడం సరికాదు. అన్ని కెరటాలు ఒకే ఎత్తు ఉండవు. కెరటాన్ని అధిగమించడానికి ఎత్తుకి ఎగిరేవారు కొందరైతే నీటిలో మునిగేవారు ఇంకొందరు. కొన్ని పరిస్థితుల్లో కెరటం తాకిడితో ఒడ్డుకు వచ్చేస్తారు. కొత్తగా సముద్ర స్నానం చేసేవారు ఈ విషయాలన్నీ పరిగణించరు. దీంతో ఎక్కువ మంది ప్రమాదాలకు గురవుతున్నారు. తీరానికి దూసుకువచ్చే కెరటం తిరుగు ప్రయాణంలో నేలను తాకుతూ వేగంగా వెళ్తుంది. ఈ క్రమంలో కాళ్ల దిగువన ఉన్న ఇసుకను తీసుకుపోతుంది.

కొన్నిసార్లు లోతు గొయ్యి ఏర్పడుతుంది. ఈ క్రమంలో స్నానం చేసేవ్యక్తి మునిగిపోయి, ప్రవాహంలో సముద్రంలోకి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. తీరం కోతకు గురయ్యేటప్పుడు కెరటం వచ్చే దిశ ఒకలాగుంటే తిరుగు ప్రయాణం వేరే దిశలో ఉంటుంది. స్నానం చేసే వ్యక్తి రెండింటినీ బ్యాలెన్స్ చేయగలగాలి. తీరానికి సమీపంలో ఈత సాధ్యపడదు. ఈత వచ్చినవారు దీమాతో సాహసించి లోతుకు వెళ్లే ప్రమాదానికి గురయ్యే పరిస్థితి లేకపోలేదు.తీర ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు కూడా పూర్తి స్థాయిలో కన్పించడం లేదు. పిక్నిక్ సీజన్ లో ఆదివారం పూట తీర ప్రాంతంలో స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులు గస్తీగా ఉంటున్నా ఇతర రోజుల్లో మాత్రం గస్తీ కొరవడుతుంది. కనీసం ఈ సీజన్ లోనైనా తీర ప్రాంతంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఇదే సందర్భంలో తీర ప్రాంతానికి వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. మద్యం మత్తులో సముద్ర స్నానాలకి దిగి ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దని సలహా ఇస్తున్నారు

## శ్రీశైలం వెళ్లే భక్తులకు, వాహనదారులకు పోలీసుల సూచనలు

నంద్యాల కార్తీక సోమవారం సందర్భంగా శ్రీశైల మహా క్షేత్రం లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు పలు సూచనలు చేసారు. శనివారం,ఆదివారం,సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందు వలన శ్రీశైలం వెళ్ళే భక్తులు తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులు(వాహనదారులు) తమ ఫోర్ వీలర్స్ వాహనంతో పాటు తప్పనిసరిగా డ్రైవింగ్ పై అనుభవం గల డ్రైవర్ ను తమ వెంట తీసుకుని వెళ్లాలని అన్నారు. ఘాట్ రోడ్డులో వాహనాలను ఓవర్ టేక్ చెయ్యరాదు. ట్రాఫిక్ నిబంధనలనుతప్పనిసరిగా పాటించాలి. మోటార్ సైకిల్ పై వెళ్ళే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలుపరాదు. పోలీసులు సూచించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలను నిలుపాలి. సాక్షి గణపతి వద్దకు కాలినడకన వెళ్ళి దర్శనం చేసుకోవాలి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా 170 మంది సిబ్బందిని నియమించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో వాహనాల పార్కింగ్ ల వద్ద విధులు నిర్వర్తించడంతో పాటు ప్రత్యేక విధులపై సిబ్బందిని కేటాయించారు. దీనికి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం అదనపు సిబ్బందిని నియమించారు.ఈ వారం చివరి సోమవారం కావడం వలన భక్తుల రద్దీని దృష్టి లో ఉంచుకొని అదనంగా 100 సిబ్బందిని నియమించారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## చిత్తూరులో లంచాల అధికారులు

### మంత్రి ఎదుటే వాటాల కోసం కుమ్ములాటలు

తిరుపతి, నవంబర్ 18, పి డెప్యూటీ సీఎం నారాయణ స్వామి ఇలాకాలో మరో అవినీతి తాహశీల్దార్ బాగోతం వెలుగు చూసింది. మొన్న పెనుమూరు తాహసిల్దార్ రమణీ వ్యవహారం, నేడు ఎస్.ఆర్.పురం తాహసిల్దార్ అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూసున్నాయి.. గతంలో అనేక మార్లు లంచాలు తీసుకుంటూ పట్టుబడినా తీరు మాత్రం మార్చుకోవడం లేదు.. ఎస్.ఆర్.పురం తాహసిల్దార్ షబ్బీర్ భాష వేధింపులు తట్టుకోలేక అధికార పార్టికి చెందిన ఓ సర్పంచ్ ఏకంగా జిల్లా కలెక్టర్ హరినారాయణకు ఫిర్యాదు చేసాడు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఎస్.ఆర్.పురం తాహసిల్దార్ కార్యాలయంకు చేరుకుని విచారణ జరిపి జిల్లా కలెక్టర్ హరినారాయణకు నివేదిక పంపారు.చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో రెవెన్యూ అధికారుల అవినితి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తూ ఉమ్మడి జిల్లా ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.. తహసీల్దారు కార్యాలయంకు వచ్చే ప్రజల నుండి నగదు ముట్టనిదే పని చేయని తాహసిల్దార్ నగదు ఇవ్వక పోతే కార్యాలయంకు వచ్చిన వారిపై దుర్భాషలాడుతూ రెచ్చి పోయే వారు.. అది ప్రజలైనా, అధికార పార్టి నాయకుడైనా ఎవరైనా సరే..తనకు నగదు మూట చేతిలో పెట్టాల్సిందే ఇదే ఆ తహసీల్దారు పాలసీ.. ఎస్.ఆర్.పురం మండల కేంద్రంలో తాహసిల్దార్ గా భద్యతలు చేపట్టారు. తన కార్యాలయంలో ఇద్దరూ విఆర్వోలను ప్రక్కన పెట్టుకుని పనికి తగ్గట్టుగా లంచం వసూలు చేసేవారు. అంతే కాకుండా ప్రభుత్వ భూములను గుర్తించి నగదు ఇచ్చిన వారికి ఆ భూములను అప్పనంగా కట్ట బెట్టేవాడు. రెవెన్యూ చట్టాలను తనకు అనుకూలంగా మార్చుకుని అక్రమాలకు పాల్పడేవాడు.. ఇదేంటని ప్రశ్నించిన వారిపై అసహ్యకరంగా దూషించేవాడు షబ్బీర్ భాషా.రోజు రోజుకి మితి మీరుతున్న తాహసిల్దార్ షబ్బీర్ భాషా ఆగడాలకు ఎలాగైనా అడ్డుకట్ట వేయాలని భావించిన స్థానిక అధికార పార్టీ సర్పంచ్ ఢిల్లియ్య, ఈ నెల తొమ్మిదోవ తారీఖున జిల్లా కలెక్టర్ హరినారాయణను కలిసి తమ సమస్య వెల్లడించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై సిరియస్ అయ్యిన కలెక్టర్ హరినారాయణ విచారణ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు . కలెక్టర్ ఆదేశాలతో ఎస్.ఆర్.పురం తాహసిల్దార్ కార్యాలయంకు చేరుకున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి విచారణ చేపట్టగా, తాహసిల్దార్ షబ్బీర్ భాషాతో పాటుగా ,మరో ఇద్దరూ విఆర్వోలు అక్రమాలు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది..దీంతో షబ్బీర్ భాషాపై ఓ నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్ హరినారాయణకు నివేదిక పంపారు. ఈ నివేదిక పరిశీలించిన తరువాత జిల్లా కలెక్టర్ తాహసిల్దార్ షబ్బీర్ భాషాపై శాఖా పరమైన చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.. గతంలోనూ షబ్బీర్ భాషాపై అనేక అవినీతి ఆరోపణను వినిపిస్తూ ఉండడంతో దానిపై కూడా జిల్లా కలెక్టర్ విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.. తను ప్రాతినిధ్యం వహిస్తున్న గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఇలాంటి అవినీతి అధికారులు ఉన్నారంటే నాకే సిగ్గేస్తుందని డెప్యూటీ సీఎం నారాయణ స్వామి మండిపడ్డారు.. మొన్న ఎస్ఆర్ పురం తాసిల్దార్, నిన్న పెనుమూరు తాసిల్దార్ బాగోతం బయటపడిందని, అవినీతి అనేది క్యాన్సర్ లాంటిది అంటుకుంటే వదలదన్నారు.. ఇలా అధికారులు అవినీతికి పాల్పడుతారని జగనన్న పేదల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేస్తున్నారని, నేను ,మంచి తాహసిల్దార్ అన్న వారే ఇలా అవినీతికి పాల్పడటం సిగ్గుగా ఉందన్నారు.. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకుల చేత ప్రతి పనికి లంచం అడగటం పనికి మాలిన తనమని, అవినీతి అధికారులపై కలెక్టర్కు ఫిర్యాదు చేయడం మంచిదేనన్నారు. అవినీతి పరులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి గట్టిగా చెప్పడం జరిగిందని డెప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు.

## వేట్లపాలెంలో మేగా మెడికల్ క్యాంప్

కాకినాడ గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ సేవలు విస్తృతం చేసేందుకు కృషి చేస్తానని టీడీపీ సీనియర్ నేత గుణ్ణం చంద్రమౌళి పేర్కొన్నారు.చంద్రమౌళి జన్మదినం సందర్భంగా కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలం వేట్లపాలెంలో గ్రామంలో గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భారీ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలోనూ విస్తృతస్థాయిలో సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చంద్రమౌళి పేర్కొన్నారు. గత ఇరవై ఏళ్ళ నుండి టీడీపీకి వెన్నెముకగా పని చేశానని ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తున్నానని టీడీపీ అధిష్టానం ఎం చెప్తే అది చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చంద్రమౌళి తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో రాజమౌళి సేవలను పార్టీ పరంగా సద్వినియోగం చేసుకుంటామన్నారు. పార్టీలో చంద్రమౌళికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని, చంద్రమౌళి రాకతో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. టీడీపీ నేతలు నారా లోకేష్, యనమల రామకృష్ణుడు, చిక్కాల రామచంద్రరావు, బొడ్డు వెంకటరమణ చౌదరి చంద్రమౌళికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కర్నూలులో పిట్టకథల మంత్రి ఫ్లెక్సీల కలకలం


కర్నూలు, నవంబర్ 18,నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో వెలసిన ఫ్లెక్సీలు కలకలం రేపాయి. ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కు వ్యతిరేకంగా కొందరు బాధితులు వీటిని ఏర్పాటు చేశారని తెలుస్తోంది. ఇళ్ల పట్టాలకు సంబంధించిన విషయంలో ఆయనకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు పెట్టినట్టు టాక్ డోన్‌లోని రుద్రాక్ష గుట్టలో వైఎస్ హయాంలో ప్రజలకి ఇళ్ల కోసం స్థలాన్ని కేటాయించారు. స్థలం మాత్రమే కేటాయించారు కానీ ఇప్పటి వరకు పట్టాల మాత్రం ఇవ్వలేదు. వచ్చిన ప్రతి ఒక్కరూ ఇదిగో ఇస్తున్నాం అదిగో ఇస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు పట్టాలు ఇస్తామంటూ మాట ఇవ్వడం... తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి సంగతి పట్టించుకోకపోవడం ఎప్పటి నుంచో జరుగుతున్న తంతే. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కూడా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాళ్లకు మాట ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టాలు ఇస్తామన్నారు. ఇన్ని ఏళ్లు గడుస్తున్నా ఆ విషయం పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. మంత్రికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు పెట్టారు. అసెంబ్లీలో పిట్టకథలు చెబుతున్న మంత్రి డోన్ పట్టణ ప్రజలకు రుద్రాక్ష గుట్టలో ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా మాట దాట వేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. వాళ్లకు సిపిఐ నాయకులు మద్దతుగా నిలిచారు. ప్రధాన కూడలిలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటుపై వైసీపీ లీడర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటివి సరికాదుంటూ మండిపడుతున్నారు. బాధితులు, సీపీఐ నాయకులు మాత్రం తమ చర్యను సమర్థించుకుంటున్నారు. పేదలకు పట్టాలు ఇవ్వకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.తమకు కేటాయించిన స్థలంపై కొందరు కబ్జాదారులు కన్నేశారని అందుకే పంపిణీలో జాప్యం జరుగుతుందని వాపోతున్నారు లబ్ధిదారులు. అక్కడ జరుగుతున్నటువంటి పరిస్థితులను గమనించిన సిపిఐ నాయకులు ఆ ప్రాంతంలో జెండాలను పాతి పెట్టారు. ఆ స్థలాలను పేదలకే ఇవ్వాలని గతంలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. స్థలాల ధరలు పెరిగిపోవడంతో పేదలకు ఇచ్చినటువంటి స్థలాలను నాయకులు కాజేయాలని చూస్తున్నారని.. అలాంటి ఆలోచన మానుకోవాలని సీపీఐ నాయకులు, ప్రజలు హితువు పలుకుతున్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో రాజకీయ నాయకులకు పేద ప్రజలు తగిన బుద్ధి చెబుతారంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పిట్ట కథలు చెబుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నట్లుగా డోను ప్రజలను కూడా అదే విధంగా మోసం చేస్తున్నటువంటి మంత్రిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు బాధితులు. డోన్ పట్టణంలోని రుద్రాక్షగుట్టలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించకుండా దౌర్జన్యంగా కూల్చివేసిన రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ గతంలో ఆందోళన చేపట్టారు. ఇప్పుడు ఏకంగా రాష్ట్ర మంత్రిగా మాట ఇచ్చి పేద ప్రజలను మోసం చేసిన బుగ్గన తీరును గమనించండి అని ఫ్లెక్సీ వెలియటం డోన్ పట్టణంలో కలకలం రేపుతోంది.ఫ్లెక్సీలను తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకోవడంతో.. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు కూడా పెద్దఎత్తున అక్కడికి చేరుకొని ఆందోళనలు చేపట్టారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ప్రాంతానికి పోలీసులు చేరుకొని బందోబస్తు నిర్వహించారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## జనసేనతో గంట కొట్టేస్తారా...



విశాఖపట్టణం, నవంబర్ 18,ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ఈనెల 12 న విశాఖ లో రాజకీయంగా తెగ హడావుడి జరిగింది. ఏపీ రాజకీయాలన్నీ విశాఖలోనే కేంద్రీకృతమై రాజకీయ తుపాన్‌కు ముందుండే వాతావరణాన్ని సృష్టించనట్టయిందంటున్నారు. ప్రధాని పర్యటనకు ఏపీ సీఎం వైఎస్ జగన్ విశాఖకు వెళ్లారు మరోవైపు మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కూడా విశాఖలోనే మకాం వేశారు. ఇంకోవైపు ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు కూడా ప్రధానితో జరిగిన పార్టీ కోర్ కమిటీ మీటింగ్‌లో పాల్గొన్నారు. దీనికితోడు ఆయా పార్టీల కీలక నేతలు కూడా విశాఖలో బస చేశారు. అయితే ఈ పొలిటికల్ సందడిలో ఓ సైలెంట్ సదేమియా కూడా హల్‌చల్ చేశారట. ఆయనే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అని చెబుతున్నారు. అదే రోజు మధ్యాహ్నం ప్రధాని పర్యటన ముగిసిన వెంటనే మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో విశాఖ నార్త్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు నోవాటల్ హోటల్ కి వచ్చారు. నేరుగా ఐదో ఫ్లోర్ కు వెళ్లారు. అదే ఫ్లోర్ లో జన సేన అధినేత పవన్ కల్యాణ్ కూడా ఉండడంతో రాజకీయ ఊహాగానాలకు తెర లేచిందట.ఐదో ఫ్లోర్‌లో గంటా దాదాపు రెండున్నర గంటల పాటు ఉన్నారు. దీంతో పవన్‌తో గంటా భేటీ అయ్యారనే ప్రచారం జరిగింది. గంటా జన సేనలో చేరేందుకు వేదిక సిద్ధం అయిందని, అందుకే పవన్ తో తుది చర్చలకు ఆయన వెళ్లారని రాజకీయవర్గాల్లో చర్చ జరిగిందంటున్నారు. అయితే గంటా దానిని ఖండించారు. అదే ఫ్లోర్ లో ఉన్న తన స్నేహితుడు, బీజేపీ నేత టీజీ వెంకటేష్‌తో లంచ్ చేసేందుకు మాత్రమే తాను వెళ్లానని, పవన్ అక్కడే ఉన్నారన్న విషయం టీజీ వెంకటేష్ రూమ్‌కి వెళ్లేవరకు తనకు తెలియనే తెలియదని చెప్పారట గంటా. అయితే గంటా ఎంత చెప్పినా రాజకీయ గంటలు మాత్రం గణగణమని మోగుతున్నాయంటున్నారు. పవన్, టీజీ, గంటా? ఈ ముగ్గురూ భేటీ అయ్యారని, జనసేన ? బీజేపీ కూటమిని బలోపేతం చేయడానికి వీళ్ల మధ్య చర్చలు జరిగాయని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌తో పాటు విభజన తర్వాత ఏపీ తొలి మంత్రివర్గంలోనూ ఐదేళ్లు మానవ వనరుల శాఖా మంత్రి గా పనిచేసిన గంటా శ్రీనివాస రావు, 2019 లో విశాఖ నార్త్ నుంచి టీడీపీ ఎమ్మెల్యే గా గెలిచారు. గంటా ఆ తర్వాత టీడీపీ కార్యక్రమాలకు పెద్దగా హాజరు కాకపోవడంతో ఆయన పార్టీ మారతారనే ప్రచారం జరిగింది. అధికారం ఎక్కడ ఉంటే గంటా అక్కడ ఉంటారని ఏపీ రాజకీయాల్లో నానుతున్న ఓ నానుడి కూడా ఆ ప్రచారానికి బలం చేకూర్చిందట. ఆయన అధికార వైసీపీ లో చేరడానికి ముహూర్తం ఖరారైనట్టు కూడా ప్రచారం జరిగింది. అప్పట్లో వైసీపీలో గంటా చేరికకు విజయసాయి రెడ్డి అభ్యంతరం అంటూ వార్తలు కూడా వచ్చాయి.ఆ తర్వాత స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్పీకర్ ఫార్మాట్‌లో గంటా రాజీనామా చేశారు. ఆ రాజీనామా ఆమోదం కోసం వ్యక్తిగతంగానూ అముదాలవలస వెళ్లి స్పీకర్ ను కలిశారు. అనంతరం అడపాదడపా టీడీపీ కార్యక్రమాలకు హాజరవుతున్నా పూర్తిస్థాయిలో ఎక్కడా ఆ పార్టీతో కలిసి ఉన్నారన్న అభిప్రాయం ఆయన అనుచరుల్లో కూడా లేదంటున్నారు.అయితే దీనిపై గంటా వాదన భిన్నంగా ఉందంటున్నారు. 1996లో తటస్థులను ఆహ్వానించిన సందర్భంలో తాను టీడీపీలో చేరానని, 1999 లో అనకాపల్లి టీడీపీ ఎంపీ గా, 2004 లో చోడవరం టీడీపీ ఎమ్మెల్యే గా ఎన్నిక అయ్యానని చెబుతున్నారు. 2009 లో మాత్రం అప్పటి పరిస్థితుల నేపథ్యం, మెగా ఫ్యామిలీ తో అనుబంధం నేపథ్యం లో పీఆర్పీకి వెళ్లానని ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో తాను అందులో చేరాల్సి వచ్చిందని ఆయన చెబుతున్నారని సమాచారం. కాంగ్రెస్ కు రాజీనామా చేసి టీడీపీలోనే చేరానని, 2014 లో భీమిలి నుంచి, 2019 లో వైజాగ్ నార్త్ నుంచి టీడీపీ నుంచే పోటీ చేశానని, మొత్తం ఐదు సార్లు తాను ఎన్నికల్లో పోటీ చేస్తే ఒక్క 2009 లో నే పిఆర్పీ నుంచి అనకాపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానే తప్ప మిగతా నాలుగు సార్లు టీడీపీ నుంచే పోటీ చేశానని, కొందరు తనపై పార్టీలు మారుతానని దుష్ప్రచారం చేస్తున్నారంటూ గంటా వాపోతున్నారని చెబుతున్నారు. తాను ఇప్పటిదాకా ఓడిపోకపోవడంతోనే ఇలాంటి చౌకబారు విమర్శలు వస్తున్నాయని గంటా ఘంటాపథంగా చెబుతున్నారుదీంతో గంటా ? పవన్ ? టీజీల భేటీ జరిగిందా? లేదంటే గంటా చెప్పినట్టు ఇదంతా టేకిట్ ఈజీ ప్రచారమా? జన సేన ? బీజేపీ కూటమి రేపు ఎన్నికల్లో పోటీ చేయబోతోందా? గంటా దానికోసమే వేచి చూస్తూ ఉన్నారా? ఈ ప్రశ్నలకు కాలంతో పాటు రాజకీయ వర్గాలు కూడా సమాధానం చెప్పాలి. అప్పుడే ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న రాజకీయ గంట మళ్లీ గణగణమని ఏ పార్టీలో మోగుతుందో తెలుస్తుందంటున్నారు పొలిటికల్ పండిట్స్.

## నాడు నేడు పనులకు భూమి పూజ.



నందికొట్కూర్ నవంబర్ 18: నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు జగనన్న నాడు నేడు ఫేస్ –ఎఎ క్రింద మంజూరైన అదనపు తరగతి గదులు. సచివాలయము, మరియు ప్రహరీ గోడ (1కోటి 30 లక్షలు)నిర్మాణమునకు భూమి పూజ కార్యక్రమమునకు హాజరైన మన నందికొట్కూరు గౌరవ శాసనసభ్యులు తొగురు ఆర్థర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శుక్రవారం నాడు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీమతి మాధవరం సుశీలమ్మ , మండల తహసిల్దార్ రాజశేఖర్ బాబు, మండల అభివృద్ధి అధికారి శ్రీమతి శోభారాణి, మండల విద్యాశాఖ అధికారి శ్రీమతి ఫైజున్నిశా బేగం. పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీ డాలు స్వాములు , బ్రాహ్మణకొట్కురు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ శ్రీ మద్దూరు హరి సర్వోత్తమ్ రెడ్డి , హాజరై నాడు నేడు పనుల భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా నందికొట్కూరు శాసనసభ్యులు తొగుర్ ఆర్థర్ మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండే విధంగా అతని చిరస్థాయి కోరిక నెరవేర్చాలని ఉద్దేశ్యంతో ఈరోజు నాడు నేడు అనే పథకంతో ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రతి కు గ్రామంలో ఉన్నటువంటి ప్రతి ఒక్క స్కూలును సుందరంగా తీర్చేదిద్దే విధంగా ఈరోజు మన ముఖ్యమంత్రి గారు చేసేటటువంటి పనులను హర్షించాల్సిందిగా ఉందన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లోని ప్రైవేట్ పాఠశాలలకు ఏ ఒక్క విద్యార్థినీలు వెళ్లడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటివరకు కూడా అడ్మిషన్లు జరుగుతున్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పి.ఇమ్మనుయేలు, ఎస్ ఎస్ ఏ డి. ఈ ఈశ్వరయ్య, గ్రామ వైసిపి నాయకులు మాధవరం యేసు రత్నం గారు, సంజన్న, రత్నం, వేల్పుల నాగన్న, వేల్పుల జయపాల్, భాగ్యరాజు, ఏసన్న, వేల్పుల జ్యోతి, నతానియేలు, బ్రాహ్మణ కొట్కూరు రఘునాథ రెడ్డి, పాఠశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## నత్తా రామేశ్వరంలో గడప గడపకు మన ప్రభుత్వం

అచంట అర్హులందరికీ సంక్షేమ పథకాలు అంది స్తామని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్య క్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరంగ నాథరాజు ఇంటింటికీ పర్యటించారు. గడిచిన మూడే ళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఆయా పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో ఆయన ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు.అనంతరం జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటీఎస్ ద్వారా 41మంది పొందిన లబ్ధిదారులు వేగవంతంగా పక్కా ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఇళ్ల పట్టా నిర్మాణం పూర్తిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు చెరుకువాడ నరసింహరాజు ,ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి(వాసు), గ్రామ కమిటీ అధ్యక్షుడు తమనంపూడి అయ్యప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ

రాయచోటి మండలంలోని కాటిమాయ కుంటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు నేడు పథకం క్రింద రూ1.10 కోట్లు నిధులతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణాలకు, మౌలిక వసతుల నిర్మాణాలకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చేతులమీదుగా గురువారం భూమి పూజలు చేయించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని ఆయన సూచించారు. తరగతి గదులను పని పూర్తి చేసి పాఠశాల యాజమాన్యాలకు అందజేయాలని తెలియజేశారు

# "పర్యావరణ పచ్చదనం ముఖ్యం

బద్వేలు ,శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ మరియు పీ.జి కళాశాల ఎన్.సి.సి కేడెట్స్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బద్వేలు శాఖ వారి ఆధ్వర్యంలో స్థానిక నూతన మున్సిపల్ భవన కార్యాలయ ప్రాంగణంలో "మొక్కలు నాటు కార్యక్రమం" చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించారుఇందులో భాగంగా ఎన్.సి.సి కేడెట్స్ జామ, వేప, నేరేడు,టేకు వంటి100 మొక్కలు పైగా నాటారు. చెట్లకు రక్షణగా ట్రీ - గార్డ్స్ కూడా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బద్వేలు శాఖ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ...మొక్కలు భావితరాలకు తరగని సంపదన్నారు. మొక్కలు వాతావరణ కాలుష్య నివారణలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. మొక్కలు నాటిన కేడెట్స్ ను ప్రశంసించారు.మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో మొక్కల పాత్ర కీలకమన్నారు. అటువంటి మొక్కలను తమ మున్సిపల్ కార్యాలయ భవన ప్రాంగణంలో నాటిన, యస్.బి.ఐ వారిని మరియు కేడెట్స్ ను ప్రశంసించారు.కళాశాల పరిపాలనాధికారి ఓ మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయికృష్ణ మాట్లాడుతూ.."వృక్షో రక్షతి రక్షితః" వృక్షాలను రక్షిస్తే అవి మనలను కాపాడుతాయన్నారు. ఎన్.సి.సి కేడెట్స్ కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, యస్.బి.ఐ మేనేజర్ రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, మేనేజర్ ముని కుమార్, డీఇ సుమన్ రెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు శివయ్య, వైసిపి నాయకులు పంగా చెన్న కృష్ణారెడ్డి,కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్.సి.సి ఏఎన్ఓస్ లెఫ్టినెంట్ టి.బాల ఓబులేసు, సబ్ లెఫ్టినెంట్ జి.సుధాకర్ రెడ్డి, వై.వీరేంద్ర, మునిసిపల్ అధికారులు మరియు యస్.బి.ఐ సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# క్లాప్ ఆటో డ్రైవర్లు వేతనాల కోసం రాస్తారోకో--సిఐటియు నాయకులు



నంద్యాల :-.క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీసవేతనం అమలు చేయాలని,ప్రభుత్వం ఇచ్చే వేతనాలలో కోత విధించరాదని,పిఎఫ్ ,ఈయస్ ఐ అమలు చేయాలని,పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ముందు ఆటోలను నిలిపి 4వ రోజు మున్సిపల్ కార్యాలయం ముందు రాస్తారోకో చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్,కార్యదర్శి కె.మహమ్మద్ గౌస్ తోపాటు క్లాప్ ఆటో డ్రైవర్లు 32 మంది పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ రెడ్డి ఏజెన్సీకి చెందిన జనరల్ మేనేజర్ వేతనాలు చెల్లించాలని కోరితే ఆటోలను తీసుకువెళ్తామని ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడం చాలా దుర్మార్గమని నిజంగా నంద్యాల పట్టణాన్ని క్లీన్ గా ఉంచేందుకు చిత్తశుద్ధి ఉంటే క్లీన్ గా ఉంచడం కోసం కృషి చేస్తున్న డ్రైవర్ల వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ సంకల్పం అనే నినాదంతో రాష్ట్రాన్ని దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో చేపడితే ప్రస్తుతం ఉన్న ఏజెన్సీలు అందుకు విరుద్ధంగా పనిచేస్తూ క్లాప్ ఆటో డ్రైవర్లకు సరైన వేతనాలు చెల్లించకపోవడం, అవి కూడా నెలల తరబడి పెండింగ్లో పెట్టడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 10,600 చెల్లిస్తే ఆటో డ్రైవర్లకు కేవలం 8270 రూపాయల మాత్రమే చెల్లించడం జరుగుతుందని, పది నెలల అతను అవుతున్న పిఎఫ్ అమౌంట్ ను చెల్లించడం లేదని,క్లాఫ్ ఆటో డ్రైవర్ కు ఏమైనా జరిగితే తమ కుటుంబాన్ని ఆదుకునే పరిస్థితుల్లో ఎవరూ లేరని ఇప్పటికైనా ఈ సమస్యలను పరిష్కారం చేయాలని అన్నారు. గత 4 రోజులుగా ఆందోళన చేస్తున్న ఏజెన్సీ వారు ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వకపోవడం దుర్మార్గమని రెండు నెలల వేతనం వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఆటోలను బయటకు తీసే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.

## విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్.

మంత్రాలయం : తీసివ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలనీ ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ 25న పార్లమెంట్ మార్చిని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు థామస్,తాలూక అధ్యక్షుడు ఎస్, ఈరేష్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ జూనియర్ కళాశాలలో విడుదల చేశారు వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ను అమలు చేయాలని నూతన విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలని దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఒక ఉద్యోగం కూడా ఇవ్వకపోగా



నిరుద్యోగ సమస్యల గురించి ప్రశ్నిస్తే నిరుద్యోగులు పకోడీ బండ్లు పెట్టుకొని బ్రతకండి అంటూ పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రులు మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు యువతకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ను అమల్లోకి తీసుకురావాలని అన్నారు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు తొత్తుగా వ్యవహరిస్తుందని ప్రభుత్వ రంగ సమస్థలను ప్రవేట్ వ్యక్తులకు దార దత్తం చేయడంలో పాటు నూతన జాతీయా విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతుంది కావున నూతన జాతీయ విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు నవంబర్ 25 ఢిల్లీలో జరిగే పార్లమెంట్ మార్చ్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రాజు,జీవన్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు జాను రాము విద్యార్థులు పాల్గొన్నారు

# ఘనంగా రాయలసీమ నామకరణ దినోత్సవం

## - ప్రభుత్వ, ప్రతిపక్షాల మోసపూరిత మాటలు నమ్మవద్దు

## -బొజ్జా దశరథ రామిరెడ్డి

నంద్యాల :-. దశాబ్దాలుగా పాలకులు, ప్రతిపక్షాలు తమ రాజకీయ స్వార్థం కోసం రాయలసీమ అభివృద్ధిని విస్మరిస్తున్నాయని, వీరి మోసపూరిత వాగ్దానాలు, ప్రకటన పట్ల రాయలసీమ సమాజం అప్రమత్తంగా ఉండాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. .శుక్రవారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో 94 వ రాయలసీమ నామకరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..సంస్కృతి, సామాజిక చైతన్యంతో విరాజిల్లిన రాయలసీమ, కొందరి స్వార్థం వలన సంస్కృతి, సాంప్రదాయాలకు విఘాతం కలుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిజాం నవాబు తన అవసరాల కోసం బ్రిటిష్ పాలకులకు వదలేసిన ప్రాంతాన్ని సీడెడ్ గా (వదలివేయబడిన లేదా అనాథ ప్రాంతంగా) పిలువబడేదన్నారు. ఈ పేరు అగౌరవంగా ఉందని ఈ ప్రాంతాన్ని దత్తమండలాలు అని వ్యవహరించేవారని పేర్కొన్నారు. చారిత్రిక, సాంస్కృతికంగా విరాజిల్లిన ప్రాంతం అనాథగా, దత్తమండలాలుగా ఉండటం సరికాదని నవంబరు 18, 1928 న నంద్యాల పట్టణంలో దత్తమండల సభ నిర్వహించి చిలుకూరి నారాయణరావు ప్రతిపాదన మేరకు ఆనాటి ప్రముఖులు శరభా రెడ్డి, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, కడప కోటి రెడ్డి, ఖాదరబాదర నర్సింగ రావు, ఆత్మకూరు సుబ్రహ్మణ్యం శ్రేష్టి, రాజ సుబ్బరాయుడు శ్రేష్టి, కె కేశన్న , ఓరుగంటి సుబ్రహ్మణ్యం, టి. రామబద్రయ్య, దాదాఖాన్ సిరాని బహుదూర్ తదతరులు రాయలసీమ నామకరణం నిర్ణయాన్ని సమర్థించారని వివరించారు. రాయలసీమగా ఆరోజు నుండి ఆత్మగౌరవ దీప్తిగా విరాజిల్లుతోందన్నారు. అస్తిత్వం కోసం ఉద్యమించి రాయలసీమ నామకరణంగా ఏర్పరుచుకుని ఆనాడే కోస్తాంధ్ర ప్రాంత నాయకుల వివక్షతను పప్పూరి రామాచార్యులు, కడప కోటిరెడ్డి, కల్లూరి సుబ్బారావు, హలహర్వి సీతారామిరెడ్డి తదితర ప్రముఖులు వ్యతిరేకించారని గుర్తు చేసారు. రాయలసీమకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడంతో ఆనాటి కోస్తాంధ్ర ప్రాంత పెద్దలకు , రాయలసీమ ప్రాంత పెద్దల మధ్య రాయలసీమ హక్కుల పత్రం శ్రీబాగ్ ఒడంబడిక నవంబరు16, 1937 న ఏర్పడిందన్నారు. శ్రీబాగ్ ఒడంబడిక రాష్ట్ర విభజన చట్టంలోని రాయలసీమ హక్కులను పాలకులు, ప్రతిపక్షాలు విస్మరించి మభ్యపెడుతున్నాయని, మూడు పంటలు పండే పొలాలను రాజధానిగా చేసి ఆ ప్రాంత 29 గ్రామాల ప్రజలకే రాష్ట్ర ప్రజలందరి సంపదతో అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి, నివాస హక్కులు కల్పించి గత ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి తూట్లు పొడిచిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానులంటూ ప్రస్తుత ప్రభుత్వం విశాఖపట్నం కేంద్రంగా రాజధాని, రైల్వే జోన్ , కే ఆర్ యమ్ బి . ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారని వివరించారు. మనచేతనే గత , ప్రస్తుత పాలకులు "జై అమరావతి, జై పోలవరం, ప్రత్యేక హోదా, జై మూడు రాజధానులు" అంటూ అరిపిస్తున్నారన వీరి పట్ల రాయలసీమ సమాజం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తమ రాజకీయ ఆర్థిక సామ్రాజ్యాలను నిర్మించుకోవడానికి విశాఖ, అమరావతి కేంద్రాలను ఏర్పరచుకుని మన భావోద్వేగాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నాయని ఆయన అన్నారు.రాయలసీమలోని మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, యువత, మహిళలు, న్యాయవాదులు, విద్యావేత్తలు బాధ్యతగా రాయలసీమ భవిష్యత్తు కాపాడుకునేందుకు ముందుకు రావాలని, పాలకులను ప్రశ్నించడం రాయలసీమ ప్రజలకు నేర్పాలని బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. రాఘవేంద్ర గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాగు నీటి సాధన సమితి ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి, రిటైర్డ్ ఆంధ్రా బ్యాంక్ ఒఊఓ శివనాగిరెడ్డి, విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా ప్రముఖులు యర్రం విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్ యస్ యస్ . నంద్యాల జిల్లా ప్రముఖ్ మనోహర్, ముస్లిం మైనారిటీ నాయకులు సౌదాగర్ ఖాసీం మియా, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు షణ్ముఖరావు, రిటైర్డ్ డిప్యూటీ డీ ఇఓ బ్రహ్మానందరెడ్డి, పట్నం రాముడు, మహేశ్వరరెడ్డి, కొమ్మా శ్రీహరి, ఏరువ రామిరెడ్డి, రిటైర్డ్ ఇంజనీర్ వెంకటసుబ్బయ్య,. .రమణారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, రాఘవేంద్ర గౌడ్, సుదర్శన కుమార్, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, తిరుపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 'యశోద' కలెక్షన్స్: ట్రెండ్ చూస్తుంటే డిజాస్టర్ అయ్యేలా ఉందే..!

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం "యశోద". గత శుక్రవారం పాన్ ఇండియా స్థాయిలో తెలుగు హిందీ తమిళ కన్నడ మలయాళ భాషల్లో విడుదలైంది. అయితే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది.'యశోద' సినిమా తొలి రోజు కలెక్షన్లు పర్వాలేదనిపించినప్పటికీ.. ఆ తర్వాత బాక్సాఫీస్ వద్ద ఏ దశలోనూ ప్రభావం చూపలేకపోయింది. ఎలాంటి కాంపిటేషన్ లేకుండా సమంత సినిమా రిలీజ్ అయింది. మంచి వసూళ్లు వస్తాయని అందరూ భావించారు. కానీ సామ్ స్టార్ పవర్ ఏమాత్రం పని చెయ్యలేదని ఫస్ట్ వీక్ కలెక్షన్స్ బట్టి తెలుస్తోంది.నిజానికి ఇటీవల కాలంలో పాజిటివ్ టాక్ వచ్చిన సినిమాలు కూడా బ్రేక్ ఈవెన్ మార్క్ అందుకోవడంలో విఫలం అవుతున్నాయి. దసరా - దీపావళి సందర్భంగా వచ్చిన ఏ ఒక్క తెలుగు చిత్రం కూడా 'హిట్' అనిపించుకోలేదు. అయితే 'కాంతారా' లాంటి డబ్బింగ్ సినిమా మాత్రం తెలుగులో 50 కోట్లకు పైగా గ్రాస్



రాబట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది.ఈ నేపథ్యంలో సమంత నటించిన 'యశోద' రిలీజ్ అవడంతో.. ఈ సినిమా 'కాంతారా' వసూళ్లను బీట్ చేస్తుందని అందరూ ఆశించారు. కానీ తొలి రోజే మిక్స్డ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం.. మొదటి వారం నాటికి పది కోట్ల షేర్ కూడా రాబట్టలేకపోయింది. రెండో వారంలో ఇంతకంటే గొప్పగా ఏం ఆశించలేం.దీన్ని బట్టి సామ్ సినిమా 'కాంతారా' ని బీట్ చేయడం కాదు కదా.. దరిదాపుల్లోకి చేరుకునే అవకాశం లేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'యశోద' కలెక్షన్స్ ట్రెండ్ చూస్తుంటే డిజాస్టర్ అనే చెప్పొచ్చు. 40 కోట్ల బడ్జెట్ ఖర్చు చేసిన నిర్మాతకు థియేట్రికల్ రిలీజ్ ద్వారా నష్టాలే మిగిలేలా ఉన్నాయి. నాన్ థియేట్రికల్ హక్కులు మాత్రమే నిర్మాతను గట్టెక్కించాలి.సరోగసీ నేపథ్యంలో మెడికల్ మాఫియా ప్రధానంగా ఫిక్షనల్ యాక్షన్ థ్రిల్లర్ గా యశోద సినిమాని తెరకెక్కించారు. తమిళ దర్శక ద్వయం హరి ఓ హరీష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీదేవి మూవీస్ బ్యానర్ పై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించారు.ఇందులో వరలక్ష్మి శరత్ కుమార్ - ఉన్ని ముకుందన్ కీలక పాత్రలు పోషించారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చగా.. సుకుమార్ సినిమాటోగ్రఫీ నిర్వహించారు. అశోక్ ఆర్ట్ డైరెక్టర్ గా.. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్ గా వర్క్ చేశారు.ఏదేమైనా 'యశోద' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటాలనుకున్న సమంత కు నిరాశే ఎదురైందని చెప్పాలి. త్వరలోనే సామ్ 'శాకుంతలం' అనే పౌరాణిక చిత్రంతో పాన్ ఇండియాని టార్గెట్ చేయబోతోంది. గుణశేఖర్ దర్శకత్వంలో దిల్ రాజు మరియు నీలిమ గుణ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది.




# ఖుషి సినిమాలో బిజీగా విజయ్

'లైగర్'సినిమా ఫలితం విజయ్ దేవరకొండను తీవ్రంగా నిరాశపరిచింది. పాన్ ఇండియా హీరోగా గుర్తింపు తెచ్చుకోవాల నుకున్న ఆయన కల.. కల గానే మిగిలిపోయింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ, శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఖుషి' సినిమా చేస్తున్నాడు. సమంత హీరోయిన్గా నటిస్తున్న ఈ చిత్రాన్ని



వచ్చే ఏడాది ప్రథమార్థంలో రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా తర్వాత విజయ్, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే కథా చర్చలు కూడా ముగిసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే రౌడి బాయ్ తాజాగా మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. టాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం విజయ్ దేవరకొండ ఓ మలయాళ సినిమాకు ఓకే చెప్పాడట. మలయాళ సూపర్ స్టార్ మోహన్లాల్ నటించనున్న 'వృషభ' సినిమాలో విజయ్ ఓ కీలకపాత్ర పోషించనున్నాడట. ఈ చిత్రంలో విజయ్.. మోహన్లాల్ కొడుకుగా కనిపించనున్నాడట. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. నందకిషోర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తండ్రి, కొడుకుల డ్రామాగా తెరకెక్కనుందట. ఏవీఎస్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, మలయాళ భాషల్లో రూపొందనుం దట. ప్రేమ, ప్రతీకారం వంటి రెండు భావోద్వేగాల మధ్య జరిగే సంఘర్షణ చుట్టూ ఈ కథ సాగనుందట. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సెట్స్పైకి తీసుకెళ్లాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది.

# రానున్న పదేళ్లలో టీ20 క్రికెట్లో పంత్దే హవా.. జట్టులో కీలక ప్లేయర్గా..




టీమిండియా యువ బ్యాటర్ రిషభ్ పంత్ను ఉద్దేశించి మాజీ వికెట్ కీపర్ రాబిన్ ఊతప్ప ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.పొట్టి ఫార్మాట్లో రానున్న పదేళ్లలో భారత జట్టులో అతడు కీలక ఆటగాడిగా ఎదుగుతాడని అభిప్రాయపడ్డాడు. టాపార్డర్లో పంత్ను ఆడిస్తే ఉపయోగకరంగా ఉంటుందని.. ఒంటిచేత్తో మ్యాచ్ను మలుపు తిప్పగల సత్తా అతడి సొంతమని వ్యాఖ్యానించాడు.డీకే రాకతో పక్కకు పంత్!కాగా వెటరన్ వికెట్ కీపర్ బ్యాటర్ దినేశ్ కార్తిక్ పునరాగమనం నేపథ్యంలో ఇటీవలి కాలంలో ముఖ్యంగా ప్రపంచకప్-2022 టోర్నీలో పంత్కు అవకాశాలు సన్నగిల్లాయి. అనుభజ్ఞుడైన డీకే వైపు మొగ్గు చూపిన యాజమాన్యం పంత్ను కాదని అతడికి వరుస అవకాశాలు ఇచ్చింది.కేవలం తొమ్మిది పరుగులేశ క్రమంలో ఐసీసీ ఈవెంట్లో కేవలం రెండు మ్యాచ్లు ఆడే అవకాశం దక్కించుకున్న రిషభ్ పంత్ దారుణంగా విఫలమయ్యాడు. జింబాబ్వేతో మ్యాచ్లో మూడు పరుగులు, ఇంగ్లండ్తో రెండో సెమీ ఫైనల్లో 6 పరుగులు మాత్రమే చేయగలిగాడు. దీంతో పంత్ ఆట తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి.ఇదిలా ఉంటే.. న్యూజిలాండ్తో ద్వైపాక్షిక సిరీస్ నేపథ్యంలో హార్దిక్ పాండ్యా సారథ్యంలోని టీ20 జట్టుకు పంత్ వైస్ కెప్టెన్గా ఎంపికయ్యాడు. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ వంటి కీలక ఆటగాళ్ల గైర్హాజరీ నేపథ్యంలో యువ జట్టు కివీస్తో పోటీ పడనుంది.రానున్న పదేళ్లలో అతడిదే హవా!ఈ నేపథ్యంలో స్పోర్ట్స్కీడాతో ముచ్చటించిన రాబిన్ ఊతప్ప టీ20లలో పంత్ భవిష్యత్పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "న్యూజిలాండ్తో సిరీస్లో రిషభ్ పంత్ ఓపెనర్గా రావాలి. పంత్ టాపార్డర్లోనే మెరుగ్గా రాణించగలడు.టీ20 క్రికెట్లో తన అత్యుత్తమ ప్రదర్శన కనబరచగలడు. తను మ్యాచ్ విన్నర్. గేమ్ చేంజర్. ఒంటిచేత్తో టీమిండియాను గెలిపించగల సత్తా ఉన్నవాడు. రానున్న పదేళ్లలో భారత టీ20 జట్టులో అతడు అత్యంత కీలక ప్లేయర్గా ఎదుగుతాడు" అని చెప్పుకొచ్చాడు. కాగా ఎడతెరిపి లేని వర్షం కారణంగా భారత్- న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన తొలి టీ20 రద్దైంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**